క్లుప్తంగా

దాసాంజనేయుడికి ప్రత్యేక పూజలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): స్వయంభూ మాచవరం దాసాంజనేయ స్వామివారి దేవాలయంలో శనివారం ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. స్వామివారికి ప్రీతికరమైన సిందూరం, ఆకుపూజలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. వాహన చోదకులు వాహన పూజలు చేయించుకున్నారు. కార్యక్రమాలను ఆలయ కార్యనిర్వహణాధికారి నాగినేని భవాని పర్యవేక్షించారు.

రూ. 9 లక్షలతో కర్మల భవనం మరమ్మతులు



మధురానగర్(విజయవాడసెంట్రల్): స్థానిక 31వ డివిజన్ ముత్యాలంపాడులో రూ. 9 లక్షలతో కర్మల భవనం మరమ్మతు పనులను శనివారం స్థానిక కార్పొరేటర్ పెనుమత్స శిరీష, రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్ నేతలతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇక్కడ కర్మల భవనంలో సమస్యలు అధికంగా ఉన్నాయని తన దృష్టికి వచ్చిందన్నారు. దీంతో తాను ఎమ్మెల్యే మల్లాది విష్ణు, నగరపాలకసంస్థ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ దృష్టికి తీసుకువెళ్లగా సమస్యల పరిష్కారానికిగానూ రూ. 9 లక్షలు మంజూరు చేశారని తెలిపారు. సాధ్యమైనంత త్వరగా పనులు పూర్తి చేసి వినియోగంలోకి తీసుకువస్తామని పేర్కొన్నారు. వైఎస్సార్ సీపీ డివిజన్ అధ్యక్షుడు పెనుమత్స సత్యం, సామంతపూడి చిన్నా, రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు డాక్టర్ ఎస్వీ సుబ్బరాజు,పీవీ సుబ్బరాజు పాల్గొన్నారు.

పార్కుల అభివృద్ధికి కృషి



పాయకాపురం(విజయవాడరూరల్): స్థానిక 62వ డివిజన్‌లో పార్కుల అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్సీ ఎండీ రుహుల్లా అన్నారు. 62వ డివిజన్‌లో శనివారం స్థానిక కార్పొరేటర్ అలంపూరు విజయలక్ష్మి, పార్టీ నాయకులతో కలిసి ఆయన పార్కులను పరిశీలించారు. ఎల్‌బీఎస్ నగర్, లహరిపార్కు, ఏవీఎస్ రెడ్డి నగర్‌లోని పార్కులను పరిశీలించి వాటి అభివృద్ధికి సంబంధిత అధికారులతో మాట్లాడతానని ఎమ్మెల్సీ రుహుల్లా పేర్కొన్నారు. పర్యటనలో వైఎస్సార్ సీపీ డివిజన్ ఇన్‌చార్జ్ మస్తాన్, నాయకులు రామిరెడ్డి, బోరా బుజ్జి, మహేష్, వెంకట్, హైమావతి ఉన్నారు.

శివకామేశ్వరీ పీఠంలో 8న మహాశివరాత్రి వేడుకలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): అయోధ్యనగర్ శ్రీదత్తసాయి శివకామేశ్వరీ పీఠంలో వచ్చే నెల 8వ తేదీ శుక్రవారం మహాశివరాత్రి వేడుకలు శ్రీధర్మపరిషత్ మహాసంస్థానమ్ ఆధ్వర్యాన ఘనంగా నిర్వహించనున్నట్లు పీఠం వ్యవస్థాపకుడు అవ్వా హేమసుందర వరప్రసాద్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మహాశివరాత్రి పురస్కరించుకుని తెల్లవారుజాము నుంచే స్వామివారికి విశేషంగా అభిషేకాలు, అర్చనలు జరుగుతాయన్నారు. సాయంత్రం 4.30 గంటలకు ప్రదోషకాలమున మహాన్యాసపూర్వక అభిషేక, అర్చనలు నిర్వహించడం జరుగుతుందని చెప్పారు. లింగోద్భవ కాలములో రాత్రి 9 గంటల నుంచి గణపతిపూజ, మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, తదుపరి శ్రీ శివపార్వతుల కల్యాణ ఉత్సవం జరుగుతుందని పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వీఎంసీ ఎన్ఎంఆర్ మృతి

మధురానగర్(విజయవాడసెంట్రల్): అజిత్‌సింగ్‌నగర్ ఫ్లై ఓవర్‌మీద శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో కఠారి నాగరాజ(40) అనే వ్యక్తి మృతి చెందారు. అజిత్‌సింగ్‌నగర్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం దావు బుచ్చయ్యకాలనీకి చెందిన కఠారి నాగరాజు నగరపాలకసంస్థలో ఎన్ఎంఆర్‌గా పని చేస్తున్నారు. ఈయనకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. శుక్రవారం రాత్రి ద్విచక్ర వాహనంపై ఇంటికి వెళుతున్న క్రమంలో అజిత్‌సింగ్‌నగర్ ఫ్లై ఓవర్ వద్ద ప్రమాదవశాత్తూ ఎదురుగా వస్తున్న ద్విచక్ర వాహనం ఢీ కొట్టింది. ఈ ఘటనలో నాగరాజు అక్కడికక్కడే మృతి చెందారు. ఎదురుగా వస్తున్న ద్విచక్ర వాహనం నడుపుతున్న మురళీకృష్ణ, బైక్‌పై ఉన్న ధనుంజయరావుకు గాయాలు అయ్యాయి. ధనుంజయరావు ఫిర్యాదు మేరకు అజిత్‌సింగ్‌నగర్ పోలీసులు శనివారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆకట్టుకున్న సైన్స్ ఎగ్జిబిషన్

పటమట(విజయవాడ తూర్పు): పటమటలోని ఎన్ఆర్ఐ ఇండియన్ స్ప్రింగ్ ఉన్నత పాఠశాలలో శనివారం సైన్స్ ఎక్స్‌పో నిర్వహించారు. విద్యార్థులు వైజ్ఞానిక నమూనా పరికరాలతో చేసిన ప్రదర్శన ఆకట్టుకుంది. ప్రదర్శనను ఎన్టీఆర్ జిల్లా డీఎస్‌వో డాక్టర్ మైనం హుస్సేన్, ఎన్ఆర్ఐ ఎడ్యుకేషనల్ ఇనిస్టిట్యూషన్స్ సహాయ కార్యదర్శి కొమ్మారెడ్డి చైతన్య, స్టెల్లా కాలేజీ అధ్యాపకులు డాక్టర్ సిస్టర్ జపమాలిన్, డాక్టర్ ఎం.వాణిలత, జీవిత పరిశీలించి విద్యార్థులను అభినందించారు. భావి భారత పౌరుల జీవితానికి ఈ ప్రదర్శన ఒక మైలురాయిగా నిలుస్తుందని చెప్పారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. స్కూల్ హెచ్ఎం లక్ష్మణరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పేదల జీవితాల్లో నూతన వెలుగులు

సెంట్రల్ నియోజకవర్గ ఇన్‌చార్జ్, ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు



60వ డివిజన్‌లో ప్రజా సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత విప్లవాత్మక సంక్షేమ పథకాలతో పేద ప్రజల జీవితాల్లో నూతన వెలుగులు నిండాయని సెంట్రల్ నియోజకవర్గ ఇన్‌చార్జ్, ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు అన్నారు. స్థానిక 60వ డివిజన్ వాంబేకాలనీలో 'గడప గడపకు మన వెలంపల్లి శ్రీనివాస్' కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. డివిజన్‌లోని జీ బ్లాకులో పర్యటించిన ఆయన స్థానిక ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వాటిలో కొన్నింటిని సంబంధిత అధికారులతో మాట్లాడి అక్కడికక్కడే పరిష్కరించారు. పలు సమస్యలను ఆయా విభాగాల ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి వాటి పరిష్కారానికి చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వెలంపల్లి మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో నిరుపేద ప్రజల జీవన ముఖచిత్రాలు పూర్తిగా మారిపోయాయని, సీఎం వైఎస్ జగన్ పాలననే రాష్ట్ర ప్రజలంతా మళ్లీ కోరుకుంటున్నారని అన్నారు. విజయవాడనగర అభివృద్ధికి అత్యధిక ప్రాధాన్యతను ఇచ్చిన ఏకైక ప్రభుత్వం వైఎస్సార్ సీపీ ప్రభుత్వమేనని పేర్కొన్నారు. సీఎం జగనన్న నగర అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించడంతో వందల కోట్లతో నగరంలో అభివృద్ధి పనులు శరవేగంగా పూర్తి చేసుకున్నాయని వెల్లడించారు. సింగ్‌నగర్, వాంబే కాలనీ పరిసర ప్రాంత ప్రజల చిరకాల కోరిక అయిన చెత్త డంపింగ్ యార్డ్‌ను తరలించిన ఘనత జగనన్న ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. వాంబేకాలనీలోని అన్ని అంతర్గత రోడ్లను నూతనంగా నిర్మించడంతో పాటు ఈ ప్రాంత ప్రజలు దశాబ్దాలుగా ఎదురుచూస్తున్న ఇళ్ల రిజిస్ట్రేషన్ల ప్రక్రియను పూర్తి చేశామని గుర్తు చేశారు. ప్రజల అండతో రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ అఖండ మెజార్టీతో మరోసారి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడం తథ్యమని ధీమా వ్యక్తం చేశారు. దుర్గగుడి చైర్మన్ కర్నాటి రాంబాబు, వైఎస్సార్ సీపీ నాయకులు బెవర నారాయణ, బత్తుల దుర్గారావు, ఎండీ ఇస్మాయేల్, సిరిశెట్టి రాజా, ఎస్‌కే బాబు, మూర్తి తదితరులు పాల్గొన్నారు.

58వ డివిజన్‌లో వెలంపల్లి కుమార్తె, అల్లుడు పర్యటన



58వ డివిజన్‌లో పర్యటిస్తున్న డెప్యూటీ మేయర్ శ్రీశైలజ, ఎమ్మెల్యే వెలంపల్లి కూతురు, అల్లుడు

ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావుకు మద్దతుగా ఆయన కుమార్తె సాయిఅశ్విత, అల్లుడు మంచుకొండ చక్రవర్తిలు 58వ డివిజన్‌లో శనివారం పర్యటించారు. డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజతో కలిసి వారు తోటవారివీధిలో ఇంటింటికి తిరిగి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజల్లో జగనన్న పాలనపై పూర్తి విశ్వాసం కనిపిస్తోందన్నారు. ప్రతీ ఒక్కరు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి, ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావుకు అండగా నిలుస్తామని చెప్పడం చాలా సంతోషంగా ఉందన్నారు. సీఎం జగనన్న ప్రవేశపెట్టిన పథకాలు, చేసిన అభివృద్ధి కార్యక్రమాలు ప్రజలకు ఎంతో ఉపయోగపడ్డాయని రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ అత్యధిక మెజారిటీతో విజయం సాధిస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

దస్తావేజు లేఖర్ల పరిరక్షణ సమితి కార్యవర్గ ప్రమాణ స్వీకారం

జిల్లా అధ్యక్షుడిగా పైలా సతీష్



ప్రమాణ స్వీకారం చేస్తున్న దస్తావేజు లేఖర్ల పరిరక్షణ సమితి ఎన్టీఆర్ జిల్లా కమిటీ సభ్యులు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఎన్టీఆర్ జిల్లా దస్తావేజులేఖర్ల వృత్తి పరిరక్షణ సమితి నూతన కార్యవర్గం ఎన్నికైంది. గాంధీనగర్‌లోని శ్రీపాద హోటల్‌లో శనివారం కార్యవర్గ ప్రమాణ స్వీకారం జరిగింది. సమితి ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడిగా పైలా సతీష్, ఉపాధ్యక్షుడిగా కొండపల్లి మురళి, ఆరేపల్లి విజయ్ కుమార్, ప్రధాన కార్యదర్శిగా మాడపాటి కృష్ణ కిషోర్, సంయుక్త కార్యదర్శులుగా పోపూరి నరేష్, యరమాల ఉమామహేశ్వరి, కోశాధికారిగా కొమ్మూరు వెంకటేశ్వరరావు, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా గోనెల దిలీప్ కుమార్, సభ్యులుగా క్షత్రి సత్యనారాయణ సింగ్, కొమ్మూరు వెంకట్రావు షేక్ మీరావలి ప్రమాణం చేశారు. కమిటీ మూడేళ్ల పాటు పదవిలో కొనసాగుతుంది. నూతన కార్యవర్గానికి రాష్ట్ర కమిటీ ప్రతినిధులు తుమ్మల హరికృష్ణ, ప్రధాన కార్యదర్శి గుంటి వేణుగోపాల్, ఉపాధ్యక్షుడు నేరేళ్ల జ్ఞాన సత్యవెంకట నారాయణ, కోశాధికారి చింతకాయల నాగ సత్యనారాయణమూర్తి , పలువురు దస్తావేజు లేఖరులు, స్టాంపు వెండర్స్ అభినందనలు తెలిపారు.

అలరించిన కూచిపూడి నృత్య ప్రదర్శన



చిన్నారుల కూచిపూడి నృత్య ప్రదర్శన

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ధర్మపథంలో భాగంగా ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో శనివారం విజయవాడకు చెందిన చింతా వెంకట శివ రామకృష్ణ కుమార్ బృందం ప్రదర్శించిన కూచిపూడి నృత్య ప్రదర్శన భక్తులను ఆకట్టుకుంది. అమ్మవారి పంచ హారతుల సేవ అనంతరం ఆలయ ప్రాంగణంలోని కళావేదికపై అక్షిత, చంద్రిక, వైష్ణవి, సాయి, హారిక, యశశ్విని, జాన్విక, లిఖితశ్రీ, గ్రీష్మలతోపాటు పలువురు చిన్నారులు అఖిలాండేశ్వరి..చాముండేశ్వరి...! కొలువైతివా.. వంటి కీర్తనలకు చక్కటి హావభావాలతో కూచిపూడి నృత్యం ప్రదర్శించారు. అనంతరం చిన్నారులకు అమ్మవారి దర్శనం కల్పించి ప్రసాదాలు అందించారు.

సామాజిక న్యాయంతోనే సమాజాభివృద్ధి సాధ్యం

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): సామాజిక న్యాయంతోనే సమాజం అభివృద్ధి చెందుతుందని దళిత స్త్రీ శక్తి జాతీయ కన్వీనర్ ఝాన్సీ గెడ్డం అన్నారు. లెనిన్ సెంటర్‌లోని బీఆర్ అంబేడ్కర్ భవన్‌లో దళిత స్త్రీ శక్తి ఆధ్వర్యాన శనివారం దళిత, ఆదివాసీలు, బాలికలపై హింసకు వ్యతిరేకంగా రౌండ్‌టేబుల్ సమావేశం జరిగింది. సమావేశంలో జ్యూరీ నిర్వహించారు. జ్యూరీ సభ్యులుగా రిటైర్డ్ జడ్జిలు జయరాజ్, జేసురత్నకుమార్, ఎస్సీ పీసీఆర్ సభ్యుడు రాజేంద్రప్రసాద్, ఎస్టీ అసోసియేషన్ జాతీయ సభ్యులు శ్రీనివాస్‌నాయక్, రత్నప్రదీప్, ప్రొఫెసర్ కుమార్ వ్యవహరించారు. 20 కేసుల వివరాలతో జ్యూరీ కిట్ రూపొందించి దళిత స్త్రీ శక్తి జ్యూరీకి అందజేసింది. ఈ సందర్భంగా ఝాన్సీ మాట్లాడుతూ దళితులు, ఆదివాసీలపై అత్యాచారాలు, హింస జరగడం దారుణమన్నారు. హింస, కుల వివక్షకు మూల కారణాలను గుర్తించి రూపుమాపాలన్నారు. రిటైర్డ్ జడ్జి జయరాజు మాట్లాడుతూ దళిత, ఆదివాసీ స్త్రీలు చైతన్యవంతులు కావాలన్నారు. జేసురత్నకుమార్ మాట్లాడుతూ కేసుల్లో నిందితులకు శిక్షలు పడాలంటే బాధితులు ధైర్యంగా ముందుకు రావాలని సూచించారు. ఆధారాలు, సాక్ష్యాలు కోర్టుకు అందించి బాధ్యులకు శిక్షపడేలా చేయాలన్నారు. సమావేశంలో దళిత స్త్రీ శక్తి ప్రతినిధులు, బాధితులు పాల్గొన్నారు.

ఆటోనగర్‌లో అగ్ని ప్రమాదం

ఆటోనగర్ (విజయవాడ తూర్పు): పాత టైర్ల దుకాణంలో అగ్ని ప్రమాదం సంభవించిన ఘటన శనివారం చోటుచేసుకుంది. ఆటోనగర్ 3వ క్రాస్ రోడ్డులో ప్రమాదవశాత్తూ పాత టైర్ల షాప్‌లో ప్రమాదం జరిగింది. సుమారు లక్ష రూపాయల ఆస్తి నష్టం సంభవించిందని అగ్నిమాపకశాఖ అధికారి నరేష్ చెప్పారు. టైర్లు పక్కనే విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఉండటం వల్ల షార్ట్ సర్క్యూట్ జరిగినట్టు చెబుతున్నారు. సకాలంలో ఫైర్ సిబ్బంది రావడం వల్ల పెద్ద ప్రమాదం తప్పింది.

సకల సౌకర్యాలతో కాపు కమ్యూనిటీ హాలు

- కోటి రూపాయలతో నిర్మాణం
- హర్షం వ్యక్తం చేస్తున్న కాపు కులస్తులు




ప్రారంభానికి సిద్ధంగా ఉన్న కాపు కమ్యూనిటీ హాలు

పాయకాపురం(విజయవాడరూరల్): పైపుల రోడ్డు, ఎల్‌బీఎస్ నగర్, పాయకాపురం, రాజీవ్ నగర్ తదితర ప్రాంత కాపు కులస్తులు కాపు కమ్యూనిటీ హాలు నిర్మాణం కోసం ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్నారు. గతం ప్రభుత్వంలోని నాయకులను కమ్యూనిటీ హాలు నిర్మించాలని ఎన్నిసార్లు కోరిన మాట దాటవేస్తూ వచ్చారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వారి కల నెరవేరింది. ఎమ్మెల్యే మల్లాది విష్ణు ప్రత్యేక చొరవ తీసుకుని కాపు కమ్యూనిటీ హాలు నిర్మాణం పూర్తి చేశారు. గతంలో కాపు కమ్యూనిటీ హాలు నిర్మాణం పేరుతో టీడీపీ కాపు కులస్తులను మభ్య పెట్టి మోసం చేసింది. గత టీడీపీ ప్రభుత్వంలో అప్పటి సెంట్రల్ నియోజకవర్గ ఎమ్మెల్యే బొండా ఉమా కాపు కులస్తుల పట్ల కల్లబొల్లి ప్రేమ చూపెడుతూ 64వ డివిజన్‌లో కాపు కమ్యూనిటీ హాలు నిర్మిస్తున్నట్టు షో చేసి శిలాఫలకం వేశారు. కానీ కమ్యూనిటీ హాలు నిర్మాణానికి అప్పటి ప్రభుత్వం నుంచి ఒక్క రూపాయి కూడా మంజూరు చేయించలేక పోయారు. దీంతో నిర్మాణ పనులు ప్రారంభం కాలేదు. 2019 ఎన్నికల్లో టీడీపీని మళ్లీ గెలిపిస్తే తప్పకుండా కాపు కమ్యూనిటీ హాలు నిర్మిస్తామని కల్లబొల్లి కబుర్లు చెప్పారు. వాస్తవాన్ని గమనించిన కాపు సోదరులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వానికి పట్టం కట్టారు. సెంట్రల్ నియోజకవర్గం నుంచి మల్లాది విష్ణు ఎమ్మెల్యేగా గెలుపొందారు. దీంతో ఎమ్మెల్యే మల్లాది విష్ణు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో మాట్లాడి కాపు కార్పొరేషన్ నిధులు కోటి రూపాయలను మంజూరు చేయించారు. స్థానిక 62వ డివిజన్ 271వ వార్డు సచివాలయం పక్కన కాపు కమ్యూనిటీ హాలు నిర్మాణానికి గత ఏడాది ఫిబ్రవరిలో మంత్రులు తానేటి వనితా, బొత్స సత్యనారాయణ, అంబటి రాంబాబు, ఎమ్మెల్యే విష్ణులు శంకుస్థాపన చేశారు. అన్ని రకాల సదుపాయాలతో కాపు కమ్యూనిటీ హాలు నిర్మించడం జరిగింది. సెంట్రల్ నియోజకవర్గంలోని కాపు కులస్తులతో పాటు పేద, బడుగు బలహీన వర్గాల ప్రజలు ఎలాంటి శుభ కార్యమైన నిర్వహించుకునేందుకు వీలుగా కమ్యూనిటీ హాలును నిర్మించడం పట్ల ప్రజలు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే మల్లాది విష్ణుకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నారు. కాపు కమ్యూనిటీ హాలును త్వరలోనే ప్రారంభించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయని అధికారులు పేర్కొంటున్నారు




టీడీపీ హయాంలో కాపు కమ్యూనిటీ హాలు నిర్మాణానికి భూమిపూజ చేసి వదిలేసిన స్థలం

అన్ని వర్గాలకు ఉపయోగకరం



స్థానిక 62వ డివిజన్‌లో ఎమ్మెల్యే మల్లాది విష్ణు సహకారంతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అన్ని రకాల సౌకర్యాలతో కాపు కమ్యూనిటీ హాలును నిర్మించింది. ఈ కమ్యూనిటీ హాలు అన్ని వర్గాల ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. అలంపూరు విజయలక్ష్మి, కార్పొరేటర్

సీఎం జగన్‌కు కృతజ్ఞతలు



రాష్ట్ర ప్రభుత్వం కాపు కార్పొరేషన్ నిధులు కోటి రూపాయలతో నిర్మించిన కమ్యూనిటీ హాలు అన్ని పంక్షన్‌లు నిర్వహించుకునేందుకు అనువుగా ఉంది. అన్ని సదుపాయాలతో కమ్యూనిటీ హాలు నిర్మించిన జగనన్న ప్రభుత్వానికి కృతజ్ఞతలు. సీహెచ్ రామిరెడ్డి, స్థానికుడు

పదో తరగతి అత్యంత కీలకం



భౌతిక శాస్త్ర పుస్తకాలు ప్రదర్శిస్తున్న ఎమ్మెల్యే మల్లాది విష్ణు, ఉపాధ్యాయులు

పాయకాపురం(విజయవాడరూరల్): విద్యార్థి దశలో పదో తరగతి ఎంతో కీలకమని రాష్ట్ర ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షుడు, ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. 62వ డివిజన్ ఎల్‌బీఎస్ నగర్‌లోని పుచ్చలపల్లి సుందరయ్య మున్సిపల్ హైస్కూల్‌లో పదో తరగతి విద్యార్థులకు ఎమ్మెల్యే చేతుల మీదుగా భౌతిక శాస్త్ర అభ్యాస దీపికలను శనివారం పంపిణీ చేశారు. అనంతరం విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. పదో తరగతి వార్షిక పరీక్షల్లో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలనే ఉద్దేశంతో భౌతిక శాస్త్ర ఉపాధ్యాయుడు డాక్టర్ మైనం హుస్సేన్ నగర పాలకసంస్థ విద్యార్థులకు ఏటా అభ్యాస దీపికలు ఉచితంగా అందిస్తుండటం అభినందనీయమని ఎమ్మెల్యే విష్ణు అన్నారు. స్వీయ అభ్యాసంతో విద్యార్థులు అన్ని ముఖ్యాంశాలను సులభంగా అర్థం చేసుకునేలా విద్యా ప్రమాణాల ఆధారంగా వీటిని రూపొందించడం జరిగిందన్నారు. ఈ అభ్యాస దీపికల్లో నిర్వచనాలు, విలువలు, సూత్రాలు రీజనింగ్, డయాగ్రమ్స్ ఉంటాయని తెలిపారు. వంద శాతం ఉత్తీర్ణత సాధనతో పాటు విద్యార్థుల్లో ఒత్తిడిని దూరం చేసేందుకు ఈ బుక్స్ ఉపయోగపడతాయన్నారు. కనుక ప్రణాళికబద్ధంగా చదివితే పరీక్షల్లో 10 జీపీఏ సాధించడం కష్టమేమీ కాదని మల్లాది విష్ణు పేర్కొన్నారు. మార్చి 18 నుంచి 30 వరకు పబ్లిక్ పరీక్షలు జరగనున్న నేపథ్యంలో గతంలో కంటే ఈ సారి మెరుగైన ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు డీ మోహన్, జిల్లా సైన్స్ ఉపాధ్యాయుడు మైనం హుస్సేన్, వైఎస్సార్ సీపీ నాయకులు అలంపూరు విజయ్, వీరబాబు, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

నాణ్యతాప్రమాణాలతో పనులు పూర్తి చేయాలి



డ్రైనేజీ పనులు పరిశీలిస్తున్న కార్పొరేటర్ జానారెడ్డి

మధురానగర్(విజయవాడసెంట్రల్): నాణ్యతా ప్రమాణాలతో నిర్దేశించిన సమయంలో పనులు పూర్తి చేయాలని 30వ డివిజన్ కార్పొరేటర్ బీ జానారెడ్డి అన్నారు. స్థానిక 30వ డివిజన్ దేవీనగర్ మెయిన్ రోడ్డులో శిథిలమైన ఓపెన్ డ్రైనేజీ స్థానంలో నూతన డ్రైనేజీ పనులు జరుగుతున్నాయి. రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులతో కలిసి శనివారం ఆయన డ్రైనేజీ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇక్కడ మురుగు కాలువ శిథిలం కావడంతో మురుగు పారక దోమలు స్వైర విహారం చేస్తున్నాయని అన్నారు. అధికారులతో మాట్లాడి రూ. 10 లక్షలు మంజూరు చేయించి పనులు ప్రారంభించడం జరిగిందని తెలిపారు. అనంతరం డ్రైనేజీ పనుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు, రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్ నేతలు పాల్గొన్నారు.

మహతీశంకర్ సేవలు వెలకట్టలేనివి



సాహితీ నీరాజనం గ్రంథాన్ని ఆవిష్కరిస్తున్న వెంకట కృష్ణారావు, నారాయణరావు తదితరులు

విజయవాడ కల్చరల్: డాక్టర్ జంధ్యాల మహతీ శంకర్ తెలుగు సాహిత్యానికి చేసిన సేవలు వెలకట్టలేనివని పోలవరపు కోటేశ్వరరావు కళా సమితి సమితి వ్యవస్థాపకుడు గోళ్ళ నారాయణ రావు అన్నారు. రసభారతి, జీఆర్‌కే పోలవరపు కళాసమితి ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో శనివారం డాక్టర్ జంధ్యాల మహతీ శంకర్ సాహితీ నీరాజనం గ్రంథ ఆవిష్కరణ నిర్వహించారు. నారాయణరావు మాట్లాడుతూ మహతీ శంకర్ పండిత కుటుంబానికి చెందిన వారన్నారు. అధ్యాపకుడిగా పనిచేస్తూనే అనేక అవధానాల్లో పాల్గొన్నారని చెప్పారు. డాక్టర్ గుమ్మా సాంబశివరావు మాట్లాడుతూ సుదీర్ఘకాలం పరిశోధన చేసి దేశీ భాషలతో పాటు 12 భాషల్లో ప్రావీణ్యమున్న వేలూరి శివరామశాస్త్రి కృతులమీద పరిశోధన చేసి డాక్టరేట్ పొందినట్లు తెలిపారు. విశ్రాంత అధ్యాపకుడు పింగళి వెంకట కృష్ణారావు గ్రంథాన్ని ఆవిష్కరించారు. మాజీ మేయర్ జంధ్యాల శంకర్ , సాహితీవేత్తలు పొన్నలూరి లక్ష్మణరావు, డాక్టర్ జీవీ పూర్ణచందు, డాక్టర్ ర్రోవి పార్థసారథి, ఉయ్యూరు సాంబిరెడ్డి, డాక్టర్ కావూరి సత్యవతి, డాక్టర్ పాలపర్తి శ్యామలానంద ప్రసాద్ మహతీశంకర్ సాహితీ ప్రస్థానం అంశంగా ప్రసంగించారు. జంధ్యాల మహతీ శంకర్ సాహితీ సేవలను వివరించారు. రసభారతి ప్రధాన కార్యదర్శి డాక్టర్ జంధ్యాల పరదేశిబాబు నిర్వహించారు. నగరానికి చెందిన పలువురు సాహితీవేత్తలు పాల్గొన్నారు.

ఆరోగ్య కార్యక్రమాలపై సమీక్ష



ఆరోగ్య కార్యక్రమాలపై సమీక్ష చేస్తున్న డాక్టర్ మాచర్ల సుహాసిని

లబ్బీపేట(విజయవాడతూర్పు): జిల్లాలో అమలవుతున్న ఆరోగ్య కార్యక్రమాలను వేగవంతం చేయాలని డీఎంహెచ్ఓ డాక్టర్ మాచర్ల సుహాసిని వైద్యాధికారులను ఆదేశించారు. తన కార్యాలయంలో శనివారం ఆమె గ్రామీణ, పట్టణ ప్రాంత వైద్యాధికారులు, పర్యవేక్షకులు, ఏఎన్ఎంలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. సుహాసిని మాట్లాడుతూ ఆర్‌సీహెచ్ పోర్టల్ అప్డేట్, ఆయుష్మాన్ భారత్ డిజిటల్ హెల్త్ మిషన్‌లో భాగంగా ఆరోగ్య సిబ్బంది హెల్త్ పర్సనల్ రిజిస్ట్రీ కార్యక్రమాన్ని త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష మొదటి విడతతో వైఎస్సార్ కంటి వెలుగు సేవల్లో భాగంగా కళ్లజోళ్లు, ఆరోగ్య శ్రీ కొత్త కార్డులు, ఆరోగ్యశ్రీ బ్రోచర్లను వెంటనే పంపిణీ చేయాలన్నారు. ఆయా కార్యక్రమాల్లో తక్కువ ప్రగతి సాధించిన సిబ్బంది పనితీరును వ్యక్తిగతంగా సమీక్షించారు. ప్రగతి సాధించని వారిపై తగు క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో డెప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ ఇందుమతి, ఎన్‌హెచ్ఎం డీపీయంఓ డాక్టర్ నవీన్, డాక్టర్ పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

వినోదాత్మక చిత్రం 'భూతద్దం భాస్కర్ నారాయణ'



సమావేశంలో హీరో శివ కందుకూరి, హీరోయిన్ రాశి సింగ్, కమెడియన్ అరుణ్‌కుమార్

లబ్బీపేట(విజయవాడతూర్పు): కామెడీతో కూడిన పూర్తి వినోదాత్మక చిత్రం భూతద్దం భాస్కర్ నారాయణ అని ఆ సినిమా కథా నాయకుడు శివ కందుకూరి అన్నారు. మార్చి 1న విడుదల కానున్న ఆ చిత్రం యూనిట్ సభ్యులు ప్రమోషన్‌లో భాగంగా శనివారం నగారానికి విచ్చేశారు. ఈ సందర్భంగా ఓ హోటల్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో హీరో శివ కందుకూరి మాట్లాడుతూ ఆంధ్రా, కర్ణాటక సరిహద్దులో జరిగిన హత్యలను దిష్టిబొమ్మ హత్యలుగా సాగే కథలో పోలీసులకు అంతుచిక్కని కేసుని హీరో ఎలా పరిష్కరించాడు అనేది సినిమాలో చూడవచ్చునన్నారు.

ఒక్క క్లూ కూడా దొరకకుండా హత్యలు చేసే సీరియల్ కిల్లర్ కేసుని డిటెక్టివ్ భూతద్దం భాస్కర్ నారాయణ ఎలా పరిష్కరించాడనేది థ్రిల్లింగ్‌గా ఉంటుందన్నారు. అనంతరం హీరోయిన్ రాశీ సింగ్ మాట్లాడుతూ విజయవాడ నుంచి తమ సినిమా ప్రమోషన్ ప్రారంభించడం చాలా సంతోషంగా ఉందన్నారు. దుర్గమ్మ దర్శనంతో తమ చిత్ర ప్రమోషన్ ప్రారంభమైందన్నారు. చిన్న చిత్రాలను ప్రేక్షకులు ఆదరించాలని కోరారు. ఈ సమావేశంలో కమెడియన్ అరుణ్‌కుమార్, నిర్మాతలు శశిధర్, కార్తీక్‌లు పాల్గొన్నారు.

అంకమ్మతల్లి శక్తిపీఠంలో కోలాటం

మధురానగర్(విజయవాడసెంట్రల్): మధురానగర్ నేతాజీకాలనీ శ్రీ అంకమ్మతల్లి శక్తిపీఠంలో శనివారం కోలాట బృందం సభ్యులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కోలాటం చేశారు. ఈ సందర్భంగా పీఠం వ్యవస్థాపకుడు పూజలు చేసి తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.